اركان ايمان

2

# ఈమాన్

## (మూల స్థంభాలు)

మూలం :

ముహమ్మద్ అమీన్ ఉమరీ
(అధ్యాపకులు: మర్కజ్ దారుల్‌బిర్, పెడన)

అనువాదం

షఫీఆ అహ్మదియా

ప్రకాశకులు :

మర్కజ్ దారుల్‌బిర్

అహ్మద్ నగర్, పెడన, ఆంధ్రప్రదేశ్, ఇండియా

ఫోన్ : 08672 200003, 9912193013.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# విశ్వాస మూల స్థంభాలు

ఇస్లాం ధర్మంలోని మౌలిక విషయాలను విశ్వాస మూల స్థంభాలంటారు. ఈమాన్ మూల స్థంభాలు ఆరు. అవి:

1. అల్లాహ్‌ను విశ్వసించటం
2. దైవ దూతలను విశ్వసించటం
3. దైవ గ్రంథాలను విశ్వసించటం
4. దైవ ప్రవక్తలను విశ్వసించటం
5. అంతిమ దినాన్ని విశ్వసించటం
5. మంచీ చెడుల విధివ్రాతను విశ్వసించటం

పైన పేర్కొన్న ఆరు మూల స్తంభాలలో ఎవరైనా ఏ ఒక్క దానిని నిరాకరించినా వారు అవిశ్వాసులుగా పరిగణించబడతారు. పై అంశాల గురించి పాఠకుల అవగాహన నిమిత్తం క్లుప్తంగా తెలియజేస్తున్నాము.

## 1. దైవాన్ని విశ్వసించడం

అంటే అల్లాహ్ ఒక్కడే సృష్టికర్త, పాలకుడు, పోషకుడు, మంచి పేర్లు, గుణాలు ఆయనకు సొంతం. ఆయన ఒక్కడే ఆరాధనకు అసలైన అర్హుడని విశ్వసించాలి. ఏక దైవ విశ్వాసాన్ని 'తౌహీద్' అంటారు. ఇవి మూడు రకాలుగా విభజించబడ్డాయి.

**1. తౌహీదె రుబూబియ్యత్ 2. తౌహీదె ఉలూహియ్యత్ 3. తౌహీదె అస్మా వ సిఫాత్**

### తౌహీదె రుబూబియత్ :

అల్లాహ్ కార్యాల్లో (పనుల్లో) ఉదాహరణకు: సృష్టించడం, పాలించడం, పోషించడం, ఆహారాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదించడంలో అల్లాహ్ ఒక్కడేనని, ఆయనకు ఎవరూ భాగస్వాములు లేరని, ఆయనకు సాటి ఎవరూ లేరని విశ్వసించడం.

### తౌహీదె ఉలూహియ్యత్ :

అన్ని విధాల ఆరాధనల్ని కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకించడం, ఆయనతో పాటు ఆయన ఆరాధనల్లో ఎవరికి కూడా సాటి కల్పించకుండా ఉండటం. ఉదాహరణకు: నమాజ్, ఖుర్బానీ, దుఆ మొదలైన ఆరాధనలు.

### తౌహీదె అస్మా వ సిఫాత్ :

పవిత్ర ఖుర్ఆన్, హదీసుల్లో ప్రస్తావించబడిన అల్లాహ్ సర్వనామాలను, గుణాలను ఎలాంటి మార్పులు చేర్పులు లేకుండా అవి అల్లాహ్‌కే ప్రత్యేకమని విశ్వసించడం. అల్లాహ్ తన గుణాల్లో ఒక్కడేనని దృఢ విశ్వాసం కలిగి ఉండటం.

## 2. దైవ దూతలను విశ్వసించడం

దైవదూతలు కూడా అల్లాహ్ సృష్టిరాశులని దృఢ విశ్వాసం కలిగి ఉండాలి.

అల్లాహ్ వాటిని కాంతితో సృష్టించాడు, వారికి రెక్కలు ప్రసాదించాడు. వారు రేయింబవళ్ళు అల్లాహ్ ఆరాధనలో, విధేయతలో నిమగ్నులై ఉంటారని విశ్వసించాలి. వారు అల్లాహ్ అవిధేయతకు ఎన్నడూ పాల్పడరు.

పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

> **"ఆయన వద్ద వున్నవారు ఆయన్ని ఆరాధించడం పట్ల గర్వం ప్రదర్శించరు. (ఆయన దాస్యం చేస్తూ) అలసిపోరు. వారు రేయింబవళ్ళు ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉంటారు. ఏ మాత్రం బద్ధకం కూడా చూపరు". *(అల్-అంబియా: 19, 20)***

అల్లాహ్ వారికి కొన్ని బాధ్యతలు అప్పగించాడు. ఉదా: దైవవాణిని ప్రవక్తలకు అందజేయడం, దిన చర్యలు లిఖించే బాధ్యత, ప్రళయదినాన శంఖం ఊదే బాధ్యత, ప్రాణాలు తీసే బాధ్యత, మరి కొందరిని గాలి నడిపించడానికి అల్లాహ్ నియమించాడు. వారందరికి జిబ్రయీల్ (అలైహిస్సలాం) ను నాయకుడిగా చేశాడు. అందుకే ఆయనకు అతి ఉన్నతమైన బాధ్యతను అప్పగించాడు. జిబ్రయీల్ (అ) దైవవాణిని ప్రవక్తలకు అందజేసేవారు.

దైవదూతల సర్వకార్యాలు గోప్యమైనవి. కాబట్టి అల్లాహ్, ఆయన ప్రవక్త (స) దూతల గురించి వివరించిన వాటన్నింటిని సత్యంగా విశ్వసించాలి. ఎవరైతే వాటిని నిరాకరిస్తారో వారు అవిశ్వాసులగా పరిగణించబడతారు.

## 3. దైవగ్రంథాలపై విశ్వాసం

అల్లాహ్ మానవుల సన్మార్గం కొరకు సమయానుసారం ప్రవక్తలపై గ్రంథాలను అవతరింపజేశాడని దృఢ విశ్వాసం కలిగి ఉండాలి.

**ఆకాశ గ్రంథాల్లో కొన్ని ముఖ్యమైనవి :**

1. **తౌరాత్ :** అల్లాహ్ ఈ గ్రంథాన్ని ప్రవక్త మూసా అలైహిస్సలాంపై అవతరింపజేశాడు.
2. **ఇన్జీల్ :** అల్లాహ్ ఈ గ్రంథాన్ని ప్రవక్త 'ఈసా' అలైహిస్సలాంపై అవతరింపజేశాడు.
3. **జబూర్ :** అల్లాహ్ ఈ గ్రంథాన్ని ప్రవక్త దావూద్ అలైహిస్సలాంపై అవతరింపజేశాడు.
4. **ఖుర్ఆన్ :** అల్లాహ్ ఈ గ్రంథాన్ని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరింపజేశాడు.

పవిత్ర ఖుర్ఆన్‌ను అవతరింపజేసిన తరువాత అల్లాహ్ పూర్వగ్రంథాలను ఆచరణ పరంగా రద్దు చేశాడు. పవిత్ర ఖుర్ఆన్ తప్ప ఇతర ఆకాశ గ్రంథాల్లో వారి అనుయాయులు మార్పులు చేర్పులు చేశారు. కానీ పవిత్ర ఖుర్ఆన్‌ను అల్లాహ్‌యే భద్రపరుస్తానని వాగ్దానం చేశాడు. కాబట్టి పవిత్ర ఖుర్ఆన్‌లో మార్పులు, చేర్పులకు అవకాశమే లేదు. ప్రళయం వరకు సమస్తలోకమంతా పవిత్ర ఖుర్ఆన్‌ను విశ్వసించడం, దాని ప్రకారం నడుచుకోవడం తప్పని సరి. సన్మార్గం పవిత్ర ఖుర్ఆన్‌ను అనుసరించడంలోనే ఉంది.

## 4. దైవ ప్రవక్తలను విశ్వసించడం

మహోన్నతుడైన అల్లాహ్ సమయానుసారం సర్వమానవాళి సన్మార్గం కొరకు ప్రతి సమాజంలోనూ ప్రవక్తలను ప్రభవింపజేశాడనే విశ్వాసం కలిగి ఉండాలి. కొన్ని సహీహ్ హదీసుల ఆధారంగా **'లక్షా ఇరవై నాలుగు వేల మంది ప్రవక్తలను'** అల్లాహ్ ప్రభవింపజేశాడు. వారిలో కేవలం 25 మంది ప్రవక్తల పేర్లను పవిత్ర ఖుర్ఆన్‌లో ప్రస్తావించడం జరిగింది. వారు :

**పవిత్ర ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడిన ప్రవక్తల పేర్లు :**

| | | |
|---|---|---|
| **1.** ఆదమ్ (అలై) | **2.** ఇద్రీస్ (అలై) | **3.** ఇస్మాయీల్ (అలై) |
| **4.** ఇస్హాఖ్ (అలై) | **5.** యాఖూబ్ (అలై) | **6.** యూసుఫ్(అలై) |
| **7.** అయ్యూబ్(అలై) | **8.** యూనుస్(అలై) | **9.** షుఅయేబ్ (అలై) |
| **10.** జుల్-కిఫ్ల్(అలై) | **11.** సులైమాన్(అలై) | **12.** దావూద్(అలై) |
| **13.** ఇలియాస్(అలై) | **14.** మూసా(అలై) | **15.** హారూన్(అలై) |
| **16.** యస్అ(అలై) | **17.** ఈసా (అలై) | **18.** నూహ్(అలై) |
| **19.** ఇబ్రాహీమ్(అలై) | **20.** హూద్ (అలై) | **21.** లూత్(అలై) |
| **22.** సాలెహ్(అలై) | **23.** జకరియ్య(అలై) | **24.** యహ్యా (అలై) |

**25. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)**

ప్రజలు సన్మార్గాన్ని విడిచి మార్గభ్రష్టతకు గురైనప్పుడు అందరికంటే ముందుగా నూహ్ (అ) ప్రవక్తగా వచ్చారు. చివరి ప్రవక్తగా ముహమ్మద్ (స) వచ్చారు. ఆయన తరువాత ఏ ప్రవక్తా రారు. ఆయన (స) బోధనలే ప్రళయం వరకూ ఉంటాయి. ఆయన కంటే ముందు వచ్చిన ప్రవక్తల బోధనలపై మహాప్రవక్త (స) షరీఅత్ వచ్చేసిన తరువాత ఆచరణ జరగదు. ఆయన (స) ప్రళయం వరకూ వచ్చే ప్రజలకు ఆదర్శమూర్తి. ప్రతి విషయంలో, ప్రతి ఆరాధనలో, ఇస్లాం ధర్మానికి సంబంధించిన ప్రతి పనిలో ఆయన్నే ఆదర్శంగా తీసుకోవాలి.

## 5. పరలోకాన్ని విశ్వసించడం

మరణించిన తరువాత మరలా లేపబడటం, దాని తరువాత సంభవించే పరిస్థితులపై పవిత్ర ఖుర్ఆన్, హదీసుల్లో ప్రస్తావించబడినట్టుగా విశ్వాసం కలిగి ఉండాలి. మనిషి మరణానంతరం పరలోకం మొదలవుతుంది. దీనికి మూడు దశలున్నాయి :

**1. బర్జఖ్ అవస్థ:** (అడ్డు తెర జీవితం) (అజ్ఞాత జీవితం) ఇది మరణం తరువాత నుండి సమాధుల నుండి లేపబడేంతవరకు ఉంటుంది.

**2. రెండవ దశ : ప్రళయం** పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "నిస్సందేహంగా ప్రళయం సంభవిస్తుంది. ఇందులో సందేహానికి ఆస్కారమేలేదు. సమాధుల్లో ఉన్నవారికి అల్లాహ్ తప్పకుండా ప్రాణం పోస్తాడు. ఈ జీవితం సమాధుల నుండి లేపబడిన తరువాత మొదలవుతుంది. స్వర్గ నరకాల తీర్పు అయ్యే వరకు ఉంటుంది.

### 3. మూడవ దశ : స్వర్గం, నరకం

**స్వర్గం :** అన్ని రకాల సుఖసంతోషాలకు నెలవు. కారుణ్యాల నివాసం. అల్లాహ్, ఆయన ప్రవక్త (స) కు విధేయత చూపేవారికి కానుకగా స్వర్గం ఇవ్వబడుతుంది. వారు అందులో ఎంతో ప్రశాంతమైన, అంతం లేని జీవితాన్ని గడుపుతారు.

### ఈ మూడు దశల సంక్షిప్త వివరణ :

**పరలోక జీవితపు మొదటి దశ : సమాధి జీవితం :**

మనిషి భూమిపై సమాధిలో వున్న జంతువులకు ఆహారమై వారి కడుపులో ఉన్నా.., మానవుడి మరణానంతరం అతను మట్టిలో ఖననమైనా లేక సముద్రం లో కలిసిపోయినా అతను ఎక్కడ ఏ రూపంలో ఉన్నా సరే – అదే అతని అడ్డుతెర (అజ్ఞాత జీవితం). అతను అక్కడ జీవిస్తాడు. అక్కడే పరీక్షించబడుతాడు. సమాధిలో మనిషికి మరలా ప్రాణం పోసిన తరువాత **'మున్కర్, నకీర్'** అనే ఇద్దరు దైవ దూతలు అతనికి మూడు ప్రశ్నలు వేస్తారు. అవి :

1. నీ ప్రభువు ఎవరు? 2. నీ ప్రవక్త ఎవరు? 3. నీ ధర్మమేది?

ఆ ప్రశ్నలకు ఒక విశ్వాసి ఇలా సమాధానం ఇస్తాడు:

**"1. నా ప్రభువు అల్లాహ్**
**2. నా ప్రవక్త ముహమ్మద్ (సఅసం)**
**3. నా ధర్మం ఇస్లాం".**

అదే అవిశ్వాసి అయితే "అయ్యో..! అయ్యో..! నాకేమి తెలీదు" అని గోల చేస్తాడు.

**పరలోక జీవితపు రెండవ దశ : ప్రళయం :** ప్రళయం ఎప్పుడు వస్తుందో దాని జ్ఞానం అల్లాహ్‌కు తప్ప మరెవరికీలేదు. ఆయన ఈ విషయాన్ని గోప్యంగా ఉంచాడు. ప్రళయం ఎలా సంభవిస్తుంది? ఇస్రాఫీల్ (ప్రళయం రోజు శంఖం ఊదటానికి నియమింపబడ్డ దూత) అల్లాహ్ ఆజ్ఞతో మొదటి సారి శంఖం ఊదగానే లోకమంతా సర్వనాశన మవుతుంది. ప్రజలందరూ స్పృహ కోల్పోయిన వారిలా అయిపోతారు.

రెండవ సారి శంఖం ఊదినప్పుడు ప్రజలందరూ తమ సమాధుల నుండి లేచి నిలబడతారు. వారందరూ హష్ర్ మైదానంలో అల్లాహ్ సన్నిధిలో తమ కర్మల లెక్కలు తెలుసుకోవడానికి హాజరవుతారు. పుణ్యాత్ములకు స్వర్గం, పాపాత్ములకు నరకం రూపంలో వారికి ప్రతిఫలం ఇవ్వడం జరుగుతుంది.

**పరలోక జీవితపు మూడవ దశ : స్వర్గం, నరకం :** స్వర్గం కూడా అల్లాహ్ సృష్టించిన సృష్టియే. హ॥ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం : నేను ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో 'స్వర్గం దేని ద్వారా నిర్మించబడుతుంద'ని ప్రశ్నించాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు :

**"స్వర్గం బంగారు, వెండి ఇటుకలతో నిర్మించబడినది. దానిలో ఉపయోగించిన సిమెంటు అధిక సువాసన గల కస్తూరి వంటిది. దీనిలోని రాళ్ళు ముత్యాలు, పగడాలు, దీని మట్టి కుంకుమ పువ్వు. ఎవరైతే దీనిలో ప్రవేశిస్తారో వారు సుఖసంతోషాలను పొందుతారు. ఎప్పుడూ కష్టాన్ని చూడరు. నిత్యం జీవించే**

ఉంటారు. మృత్యువు వారి దరి చేరదు. వారి దుస్తులు మాసిపోవు. వారి యవ్వనం తరిగిపోదు". (సహీహ్ తిర్మిజి)

మరో హదీసులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు : **"స్వర్గంలో 100 అంతస్తులున్నాయి. ప్రతి రెండు అంతస్తుల మధ్య భూమ్యా కాశాల మధ్య ఉన్నంత దూరం ఉంటుంది". (తిర్మిజీ)**

## నరకం

ఇది చాల చెడ్డ నివాసం. అది ఎంతో లోతైనది, భయంకరమైన అగ్ని గుండం. అందులో ఒక రాయి వేస్తే అది అడుగున చేరడానికి 70 ఏండ్ల సమయం పడుతుంది. దానిలోని అతి సులువైన శిక్ష నిప్పు చెప్పులను తొడిగించడం. వాటిని ధరించిన వ్యక్తి మెదడు ఆ వేడికి ఉడుకుతూ ఉంటుంది. ప్రపంచపు నిప్పుకంటే నరకం నిప్పు వేడి 70 రెట్లు ఎక్కువగా ఉంటుంది. అక్కడ ఇవ్వబడే నీళ్ళు ఎంత భయంకరంగా ఉంటాయంటే వాటిని త్రాగే వ్యక్తి ప్రేగులు తెగి పోతాయి. ఇలాంటి శిక్షలను భరించలేక నరకవాసులు కన్నీరు మున్నీరై విలపిస్తారు. వారి ఏడ్పులకు కన్నీళ్ళు ఇంకిపోయి వాటికి బదులుగా రక్తం కారుతుంది.

(అల్లాహ్ మనల్ని ఈ నరక బాధల నుండి విముక్తి కల్పించుగాక..! ఆమీన్)

**6. మంచి, చెడు విధివ్రాత (తఖ్దీర్)ను విశ్వసించడం:** విధివ్రాత (తఖ్దీర్) గురించి నాలుగు దశలపై విశ్వాసం కలిగి ఉండాలి. అవి :

**1. జ్ఞానం :** ప్రతి విషయం గురించి అల్లాహ్‌కు జ్ఞానం ఉందని విశ్వసించాలి.

**2. లిఖించబడినది :** అల్లాహ్ ప్రళయం వరకు జన్మించే, వచ్చే విషయాలన్నింటి గురించి అల్లాహ్ సురక్షిత ఫలకం (లౌహె మహ్ఫూజ్)లో వ్రాసిఉన్నాడు. దీనిని విశ్వసించాలి. దీనినే సురక్షిత ఫలకం (లౌహె-మహ్ఫూజ్) అంటారు.

**3. దైవేచ్ఛ, దైవప్రణాళిక:** విశ్వంలో జరిగేదంతా అల్లాహ్ ఆజ్ఞానుసారమే, ఆయన ప్రణాళికననుసరించే జరుగుతుంది. ఆయన ఆదేశానికి భిన్నంగా ఏదీ జరగదని విశ్వసించాలి.

**4. సృష్టించడం :** సర్వ సృష్టికి సృష్టికర్త అల్లాహ్‌యే. కనుక అల్లాహ్ తప్ప మిగతావన్నీ అల్లాహ్ సృష్టించినవే.

విధి వ్రాతను విశ్వసించడం, దాని పట్ల అంగీకారం కలిగి ఉండటం మన విశ్వాసంలోని ఒక ముఖ్య భాగం. విధి వ్రాతను విశ్వసించని వారు అవిశ్వాసులవుతారు. ఏదైనా పని చేయదలచినప్పుడు దాని సంబంధిత అవసరా లను ఉపయోగించడం 'తఖ్దీర్'కు విరుద్ధం కాదు. అల్లాహ్‌పై నమ్మకాన్ని కలిగి ఉండి దాని సంబంధిత అవసరాలను ఏర్పాటు చేసుకోవడం సరైన విధానం. ఎందుకంటే పని, దాని కారకాలు విధివ్రాత నుండే ఉన్నాయి. కేవలం కారకాలను నమ్ముకుని అల్లాహ్‌పై విశ్వాసాన్ని కలిగి ఉండకపోవడం విశ్వాసానికి విఘాతం కలిగించేదే..

అల్లాహ్ మనందరికీ పైన ప్రస్తావించబడిన అంశాలపై స్థిర విశ్వాసం కలిగి ఉండే అనుగ్రహాన్ని ప్రసాదించుగాక! ఆమీన్